
క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేషంగా అభిషేకాలు


ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

పెందుర్తి: సరిపల్లి భాష్యం పాఠశాలలో వివా పబ్లిషర్స్ ఆధ్వర్యంలో జోనల్ లెవల్‌లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు. విజేతలకు భాష్యం సీఈవో సత్యం, జోనల్ ఇన్‌చార్జి వెంకట్ చేతుల మీదుగా బహుమతులు అందించారు.

గిరిజన ఉద్యోగులకు ఘన సన్మానం


గిరిజన ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

పెందుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన గిరిజన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, పెందుర్తి ఏరియా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్తంగా సోమవారం ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు అందించిన సేవలు అమోఘం అని కొనియాడారు. ప్రభుత్వ సంస్థల్లో సేవలందించిన తాంగుల రంగారావు, తలారి చిట్టమ్మ, లంపిముఖి సత్యారావు, జంపరంగి నారాయణరావులను ఘనంగా సత్కరించారు.

ఘనంగా జాతీయ భద్రత దినోత్సవం

పరవాడ: స్థానిక జేఎన్ ఫార్మాసిటీలో 53వ జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎం.ఎ.ఎస్.ఆర్.ఎం కార్యాలయం వద్ద అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శివరాంప్రసాద్, జెట్టి సుబ్బారావు జెండాను ఆవిష్కరించారు. సుబ్బారావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. జాతీయ భద్రత దినోత్సవ వేడుకలు ఈ నెల 9 వరకు కొనసాగుతాయని చెప్పారు. ఫార్మా ఉద్యోగులకు వ్యక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, భద్రత అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం


ఈవో శ్రీనివాసమూర్తికి నగదు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం ద్వారకా తిరుమలకు చెందిన పి.ఈశ్వర సాయి రామకృష్ణ అనే దాత లక్ష 116 విరాళం నగదు రూపంలో ఈవో శ్రీనివాస మూర్తికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్ అందజేసి స్వామి దర్శనం కల్పించారు. ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

పేదలకు శాశ్వత గూడు


లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

- సీఎం జగన్ పెద్ద మనసుతో పేదల సొంతింటి కల సాకారం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ శాశ్వత నివాసం కల్పిస్తోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పెందుర్తి నియోజకవర్గంలోనే 23 వేల మందికి ఇంటి పట్టాలు అందజేశామన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి సైతం మండలంలో ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు వారందరికీ శాశ్వత నివాసం కల్పించే దిశగా గృహ నిర్మాణాలు చేపడుతోందన్నారు. గత ప్రభుత్వాలు గడిచిన పదేళ్లలో 20 పట్టాలు కూడా ఇవ్వలేదన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలం

రాష్ట్రంలో సొంత గూడు లేని వారు ఉండకూడదన్న మహోన్నత లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న వారికి విలువైన ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేసి సీఎం జగన్ తన గొప్ప మనసు చాటుకున్నారని చెప్పారు.

రైతులకు కృతజ్ఞతలు : పేదల ఇంటి స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులకు అభినందనలు తెలిపారు. గృహ నిర్మాణ పట్టాల రిజిస్ట్రేషన్ దస్తావేజులతో పాటు ప్రభుత్వం క్రమబద్ధీకరించిన అతుకుబడి డీ పట్టాలను, భూముల సేకరించిన రైతులకు రిజిస్ట్రేషన్ దస్తావేజులను అందజేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, తహసీల్దార్ జె. చలమయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,మండల సముద్రం,వడ్డాది అప్పలరాజు,గవర శ్రీను, యడ్ల నాయుడు,ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రిజిస్ట్రేషన్



నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా మా వద్ద అమరపిన్నివానిపాలెంలో సుమారు ఎకరం భూమి ప్రభుత్వం తీసుకుంది. బదులుగా మాకు 500 గజాల స్థలం ఇచ్చింది. మేం ఆరుగురు అన్నదమ్ములు కావడంతో ఒక్కొక్కరికీ 82 గజాల చొప్పున ఇచ్చారు.సుమారు రూ.70 వేల నుంచి రూ. 80 వేలు అయ్యే రిజిస్ట్రేషన్ ఖర్చులను ప్రభుత్వమే భరించింది. రిజిస్ట్రేషన్ చేయించి దస్తావేజులను మాకు అందజేశారు.

– పెట్ల రాము,
అమరపిన్నివానిపాలెం,సబ్బవరం

పాసు పుస్తకాలు అందుకున్నాం



పైడివాడ అగ్రహారంలో 2.10 ఎకరాల ప్రభుత్వ భూమి మాకు ఉంది.నేను ఇద్దరు అక్కలతో కలిసి అదే భూమిని పంచుకున్నాం. మా ముగ్గురికి ప్రభుత్వం క్రమబద్ధీకరించిన ఫ్రీ హోల్డింగ్ పట్టాలను మంజూరు చేసింది. నేను,మా చిన్నక్క అక్కిరెడ్డి నూకాలమ్మ ఈ ఫ్రీ హోల్డింగ్ పట్టాదారు పాస్ పుస్తకాలను అందుకున్నాం.

– సరిపల్లి నర్సింగరరావు,
పైడివాడ అగ్రహారం, సబ్బవరం

నా కల నెరవేరింది



ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న రూరల్ హౌసింగ్‌లో భాగంగా పైడివాడ అగ్రహారంలో 1.5 సెంట్ల స్థలం ఇచ్చింది.దీంతో పాటు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేశాం. ఇచ్చిన పట్టాను మరలా నా పేరున రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు అందజేసింది.అవివాహితను కావడంతో ఒంటరిగా ఉండే నాకు ఈ ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లో నిశ్చింతగా ఉంటున్నాను.

– జి.పరదేశమ్మ,
పైడివాడ అగ్రహారం, సబ్బవరం

సామాజిక భవనానికి శంకుస్థాపన


యాత-శెట్టిబలిజ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో యాత-శెట్టిబలిజ సామాజిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం శంకుస్థాపన చేశారు. సబ్బవరం డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఈ భవానానికి మండల యాత-శెట్టిబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సూజాత, పెందుర్తి యాత సంఘం గౌరవ అధ్యక్షుడు కేసుబోయిన త్రినాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మండల సముద్రం,దేడ్డం పద్మావతి, తాటి పాముల శేఖర్,అంగటి సూరిబాబు,కాకర సర్వారావు,సమ్మంగి వెంకట రమణ,నెల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు ప్రాధాన్యం


భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఇతర అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో 53వ జాతీయ భద్రత దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్, టౌన్‌షిప్ నివాసితులతో ప్రాజెక్టు హెడ్ సిన్హా సేఫ్టీ వాక్ నిర్వహించి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సేఫ్టీ పార్క్‌లో జెండాను ఆవిష్కరించారు. ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ పర్యావరణం, పాలన శ్రేష్టత కోసం కాంట్రాక్టు కార్మికులకు దిశానిర్దేశం చేశారు. కాంట్రాక్టు కార్మికులంతా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రత సంస్కృతిని మెరుగుపర్చడానికి ప్రవర్తన ఆధారిత భద్రతను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జగన్ సారథ్యంలోనే 'నగరాలు'కు గుర్తింపు


సంఘీభావం తెలియజేస్తున్న నగరాల కుల పెద్దలు

మధురవాడ: నగరాల కులానికి ప్రత్యేక గుర్తింపు నిచ్చి, ప్రోత్సహించింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని నగర కుల పెద్దలు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు రెండు సార్లు చైర్మన్ పదవి మధురవాడ ప్రాంతానికి చెందినవారికి ఇచ్చారన్నారు. తమకిచ్చిన గౌరవానికి కృతజ్ఞతగా బుధవారం మధురవాడ శిల్పారామం జాతరలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. నగరాలను బీసీ ఏలో చేర్చాలని, తమ కులసామాజిక భవనం నిర్మాణానికి ప్రభుత్వ ఎకరా స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నగర కుల పెద్దలు పోతిన హనుమంతురావు, జగ్గపిల్లి అప్పలరాజు, పీకేఎం పాత్రుడు, పిళ్లా సూరిబాబు, వాండ్రాసి రవి, పిళ్లా రమణ, పోతిన సుమన్ వెంకటరావు, నాగోతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ: మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తానాం గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. ఈ నెల 31 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు కోరారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరికి రిమాండ్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బిహార్‌కు చెందిన లాలం కుమార్ యాదవ్ అనే వ్యక్తి చెన్నైలోని ఓ టీ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి మరో టీ షాపులో వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు కుమార్ యాదవ్‌తో మంతనాలు జరిపి అరకు ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకొస్తే రూ.3 వేల ఇస్తానన్నాడు. అరకు వెళ్లేందుకు ట్రైన్ టికెట్లు తీస్తానని చెప్పి దారి ఖర్చుల కోసం రూ.1000 రూపాయలు ఇస్తానని చెప్పడంతో కుమార్ యాదవ్ ఒప్పుకున్నాడు. దీంతో చెన్నై నుంచి బయలుదేరి విశాఖ వచ్చిన కుమార్‌ను రైల్వే స్టేషన్‌లో అరకుకు చెందిన మధ్యవర్తి వచ్చి అరకు తీసుకెళ్లాడు. అక్కడ నాలుగు కిలోల గంజాయి కొని లాలం కుమార్ యాదవ్‌కు రెండు ప్యాకెట్లుగా తయారు చేసి అందజేశాడు. నాలుగు కిలోలకు సంబంధించిను నగదును ఫోన్‌పే ద్వారా చెన్నైలో ఉన్న వ్యక్తి పంపించాడు. అరకు నుంచి గంజాయి తీసుకొచ్చిన కుమార్ యాదవ్ విశాఖ రైల్వే స్టేషన్ దరి అనుమానాస్పదంగా కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నాలుగు కిలోలు గంజాయి తరలిస్తున్నట్టు చెప్పడంతో నిందితుడిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ ఎస్.విజయకుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఫిఫ్త్ టౌన్ పీఎస్ పరిధిలో..

మద్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.

వివరాలిలా.. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆదివారం ఉదయం కంచరపాలెం మెట్టు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న కేరళకు చెందిన అస్కర్ అలీ అనే వ్యక్తి అరకు నుంచి గంజాయిని తరలిస్తున్న క్రమంలో అతడిని పట్టుకున్నారు. 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చని ఆలయ వర్గాలు తెలిపాయి.

విమ్స్‌లో ప్లాస్టిక్ సర్జరీ ఉచిత వైద్య శిబిరం రేపు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఈ నెల 6న ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ బ్లాక్‌లో ఏర్పాటు చేయనున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణం మొర్రి, డయాబెటిక్ ఫుట్, పురుషులలో రొమ్ము గ్రంధి పెరుగుదల, బోదకాలు, కిలాయిడ్ చికిత్సలు, కాలిన గాయాలు, విరిగిన చేతులు, కాళ్లు, వాస్కులర్ సమస్యలకు ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీలకు సంబంధించిన చికిత్సలు ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా రూ.6 వేలు ఖరీదైన కలర్ డాప్లర్, ఎక్స్‌రే, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రవేశం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి

డాబాగార్డెన్స్: ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'కెరీర్ ఆపర్చ్యూనిటీ ఫర్ వుమెన్ ఇన్ ఇండియన్ నేవీ' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో స్త్రీ ప్రవేశించలేని రంగమంటూ ఏదీ లేదన్నారు. ఇండియన్ నేవీలో చేరి, దేశ సేవలో మాతృభూమి రుణం తీర్చుకోవాలని విద్యార్థినులకు సూచించారు. లెఫ్టినెంట్ కమాండర్ ఆఫ్ ప్రిన్సిపల్ మెడికల్ ఆఫీసర్ అశ్వతీసుందరం మాట్లాడుతూ పదేళ్ల తర్వాత ఎలా వుండాలో విద్యార్థి దశలోనే నిర్ణయించుకుని, ఆ మేరకు కృషి చేయాలని సూచించారు. నేవీలోకి ప్రవేశించి మహిళా శక్తిని నిరూపించుకోవాలని చైతన్యపరిచారు. వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కేవీఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినులు నేవీలో ఉపాధి పొంది పలువురికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

పేదల పక్షపాతి సీఎం జగన్


లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


ఇండోర్ స్టేడియం రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే సోమవారం అందజేశారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఊరుకోకుండా ఇళ్లు నిర్మించడంతో పాటు వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారని కొనియాడారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న ప్రతి మహిళా జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడలకు పెద్దపీట

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడలను మరింతగా ప్రొత్సహించడం జరిగిందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చెప్పారు. అనంతరం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్‌స్టేడియానికి రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. క్రికెట్ క్రీడా మైదానంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే అదీప్ రాజ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, తహసీల్దారు గణపతిరావు, ఎంపీడీవో కీర్తి స్పందన తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకుడు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండిగరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

1117వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఉద్యమంలో దేశంలోని ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1117వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ చరిత్రలో ఓ చెరగని అధ్యాయమన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. అమరవీరుల ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరు సాగిస్తామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి


స్టీల్‌ప్లాంట్ పే సెక్షన్ ఇన్‌చార్జిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై నాయకులు సోమవారం ప్లాంట్‌లోని పే సెక్షన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ కోసం కష్టపడే కార్మికులకు ఇంతవరకు జీతాలు చెల్లించక పోవడం అన్యాయమన్నారు. జీతాల జాప్యం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పే సెక్షన్ ఇన్‌చార్జి రామ్‌ప్రసాద్‌ను కలిసి చర్చించారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, జి.వి.సుబ్బయ్య, ఎస్.ఎ.నాయుడు, బీ.ఎన్.రాజు, పి.వి.నగేష్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే బీఎస్పీ మేనిఫెస్టో


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త పూర్ణచంద్రరావు

సీతంపేట: బహుజనుల రాజ్యాధికారమే బహుజన సమాజ్‌పార్టీ మేనిఫెస్టో అని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తోందని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త, మాజీ ఐపీఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రా జిల్లాలు బహుజన జిల్లాలని, రాష్ట్రాన్ని ఏలే రెండు కులాలకు సంబంధం లేని జిల్లాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండుకులాల మధ్య, రెండు పార్టీల మధ్య విపరీతమైన సంఘర్షణ వాతావరణం ఉందని, కొన్ని వేల కోట్లతో రాజకీయ వ్యాపారం జరుగుతోందన్నారు.

రాజకీయ పార్టీలు ఓట్లను ఎలా కోట్లుగా మార్చుకుంటున్నారో బహుజనులు గుర్తించాలన్నారు. లకే రాజారావు ఆదర్శవంతమైన నాయకుడని, ఆయనే అందరికీ స్ఫూర్తి అని అన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తున్న బీఎస్పీని అభ్యర్థులను బహుజనులంతా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, రాష్ట్ర కార్యదర్శి కదిరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.తిరుపతిరావు, ప్రకాష్, శివప్రసాద్, బోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.